
క్లుప్తంగా

వినాయక నిమజ్జనోత్సవంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో శనివారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎంపీపీ ఇంటూరి పద్మావతిఅంజిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపు ఆసాంతం తీన్‌మార్ డప్పులు, మేళతాళాలు, డీజే పాటలతో సాగింది. గ్రామంలోని ప్రజలు స్వామికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు స్వామి ఊరేగింపుకు వార్లు పోసి సాదరస్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు, యువత పాల్గొన్నారు.

వైభవంగా గణపయ్య ఉత్సవాలు



పొన్నూరు: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వేంచేసి ఉన్న విఘ్నేశ్వరుడిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి హోమం, శాంతి కళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లడ్డు పాట అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. సాయంత్రం వినాయకుడి నిమజ్జనం ఊరేగింపు వైభవంగా జరిగింది. కార్యక్రమాలను ఆర్యవైశ్య కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అనారోగ్యాలపై అవగాహన


తెనాలి: పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆగస్టు నెల సమావేశం ఆదివారం సాయంత్రం కవిరాజు పార్కులోని వీజీకే భవన్‌లో జరగనుంది. సాయంత్రం ఆరు గంటలకు ఆరంభమయ్యే సభకు అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహిస్తారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్ 'వృద్ధాప్యం–అనారోగ్య సమస్యలు' అంశంపై ప్రసంగిస్తారు. సభ్యుల సందేహాలకు సమాధానాలిస్తారు.

అబాకస్ పోటీల్లో సత్తా చాటిన తెనాలి విద్యార్థులు



తెనాలి: 'యూసీమాస్' సంస్థ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి, తర్వాత హైదరాబాద్‌లో జరిపిన జాతీయ స్థాయి అబాకస్ పోటీలో తెనాలిలోని మాస్టర్ బ్రెయిన్ అబాకస్ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటారు. వేలాదిగా పాల్గొన్న ఈ పోటీల్లో తెనాలి విద్యార్థులు టి.హేత్విక్, ఓ.షణ్ముఖ అభిరామ్, ఎ.విహాస్‌రామ్, కె.నాగహాష్విక్, ఎ.ప్రభంజన్, ఎస్‌డీ దీనాజ్‌రోష్ని, కె.నాగమిథున్, టి.తక్ష, వెంకటసాయి కిరణ్‌లు ప్రతిభ చూపి పలు అవార్డులను గెలుచుకున్నారు. విజేతలకు మాస్టర్ బ్రెయిన్ అబాకస్ డైరెక్టర్లు షేక్ షాఫియా, షేక్ షాకియాలు అభినందనలు తెలియజేశారు.

సబ్ రిజిస్ట్రార్‌గా హరికిషన్ బాధ్యతల స్వీకరణ



తెనాలి: పట్టణ కొత్తపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్–2గా మాదినేని హరికిషన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన ఆ తర్వాత చేబ్రోలు, గుంటూరులో పనిచేశారు. పదోన్నతిపై తెనాలికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన హరికిషన్‌ను సబ్ రిజిస్ట్రార్–1 కె.బుజ్జిబాబు, దస్తావేజు లేఖర్లు వజ్రాల రామలింగాచారి, వై.పేరయ్య, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు.

తెనాలిలో చిరుజల్లులు

తెనాలి అర్బన్: పట్టణంలో శనివారం సాయంత్రం చిరు జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి ఎండ కాసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. అనంతరం కొద్దిసేపటికే చిరు జల్లులతో వర్షం కురిసింది. సుమారు అరగంట సేపు పడి ఆగిపోయింది. సాయంత్రం వేళ కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు.

పాచి తెట్టు.. మురికి నీళ్లు!

వెనిగండ్లలో తాగునీటి దుస్థితి
- ప్రక్కనే చెరువు నీరు వృథాగా పోతున్నా స్పందించని పంచాయతీ
- రంగుమారి, నీరువాసన వస్తున్నా యంత్రాంగానికి పట్టదు
- రెండు రోజులకొకసారి తాగునీటి సరఫరా



వెనిగండ్లలో అడుగంటిన మంచినీటి చెరువు

పెదకాకాని: గ్రామంలో తాగునీటి ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. వేసవి కాలంలో చెరువు నీటి పరిమాణం తగ్గడంతో చెరువు చివరలో ఉన్న లోతైన ప్రాంతం నుండి తాత్కాలిక మోటార్ ఏర్పాటు చేసి నీటిని ఫిల్టర్ బెడ్‌లకు పంపింగ్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అదే ప్రదేశంలో మోటర్ ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. వర్షాకాలం సగానికి పడినప్పటికీ చెరువులో మాత్రం ఆశించిన స్థాయిలో నీటి పరిమాణం పెరగలేదు.

చెరువు నీటిలో పాచి తెట్టు!

చెరువు నీటిలో పాచి తెట్టలు కట్టి కనిపిస్తున్నారు. గత ఐదేళ్లగా గ్రామంలో రెండు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. తాగునీరు నిల్వ చేసే చెరువు ప్రక్కనే ఉన్న నల్లచెరువుకు పొలాలు, ప్లాట్ల నుంచి పెద్ద మొత్తంలో నీరు చేరడంతో ఆ చెరువు తొణికిసలాడుతోంది. వాస్తవానికి ఆ చెరువు నీటిని చెరువు ఆయకట్టులో ఉన్న రైతులు పొలాలు పండించడానికి, వేసవి కాలంలో గేదెలు, గొర్రెలకు తాగునీటి అవసరాలు తీర్చుకునేందుకు ఉపయోగపడుతుంది. మంచినీటి చెరువులో నీటి పరిమాణం పెరగకపోవడంతో నల్లచెరువులో నీరు గ్రామంలో తాగునీటి అవసరాలకు ఉపయోగించుకునేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని పలువురు రైతులు పంచాయతీ అధికారులకు తెలియజేశారు. ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంటూరు చానల్(కొత్తకాలువ) నీటిని మంచినీటి చెరువుకు పంపింగ్ చేస్తున్న అధికారులు 60 మీటర్ల దూరంలో ఉన్న నల్లచెరువు నీటిని మంచినీటి చెరువుకు పంపింగ్ చేయడంపై మాత్రం దృష్టి సారించడం లేదు. నల్ల చెరువు భారీ వర్షాలకు నిండి బ్రాంచి కాలువ ద్వారా వాగుకు చేరి కృష్ణానదిలో కలుస్తోంది.



చెరువులో నీటి పరిమాణం తగ్గడంతో ఏర్పాటు చేసిన మోటార్‌తోనే ఇప్పటికీ నీటి సరఫరా



వెనిగండ్లలో రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్‌బెడ్‌లు

ముందు చూపు లేకపోవడం వల్లే...

అధికారులు ముందు చూపు లేపోవడం, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వలన చెరువుకు నీరు పెట్టడంలో విఫలమవుతున్నారు. దీంతో గ్రామంలోకి ఉప్పునీరు, రంగుమారిన నీరు సరఫరా అవుతోంది. ఈ పథకం నిర్వహణలో గ్రామ ప్రజల అవసరాల దృష్ట్యా రెండు ఫిల్టర్ బెడ్‌లు, ఒక మైక్రో ఫిల్టర్, రెండు వాటర్ ట్యాంక్, చెరువుకు నీరు పంపింగ్ చేసేందుకు నూతనంగా కొనుగోలు చేసిన మోటార్‌లు ఏర్పాటు చేశారు. వీటితో పాటు వేసవికాలంలో నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని చెరువుకు దూరంగా రెండు బోర్లు ఏర్పాటు చేశారు. వర్షాకాలం సైతం చెరువు నుంచి ఫిల్టర్‌బెడ్లకు చేరి ఫిల్టర్ అవుతున్న నీటిలో బోర్ల ద్వారా వచ్చే నీటిని కలిపి గ్రామంలో సరఫరా చేస్తున్నారు. అయితే బోర్లల్లో నీరు ఉప్పగా ఉన్నా .. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ నీటిని తాగుతున్నారు గ్రామస్తులు. మొత్తం 1850 కుళాయిలు ఉండగా 12 పబ్లిక్ కుళాయిలు ఉన్నాయి. మంచినీటి చెరువు వెంబడి తొణికిసలాడుతున్న నల్లచెరువు నీటిని చెరువులోకి పంపింగ్ చేయడంలోనూ అధికారులు విఫలమవుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును వివరణ కోరగా పాలకవర్గం సహకరించడం లేదన్నారు.

పంచాయతీలో తీర్మానం చేస్తాం



మంచినీటి చెరువులో నీటి పరిమాణం తక్కువగా ఉండటంతో ప్రక్కనే ఉన్న నల్లచెరువు నీటిని మంచినీటి చెరువుకు పంపింగ్ చేయాలని గతంలోనే తీర్మానం చేశాం. అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామ తాగునీటి అవసరాల దృష్ట్యా రైతులు కూడా సానుకూలంగా స్పందించినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

– వేల్పుల శ్రావణి, సర్పంచి

నాడి చూసేదీ.. మందులిచ్చేది ఫార్మాసిస్టే!

- పెదకాకాని పీహెచ్‌సీలో ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- రోగుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు

పెదకాకాని: మండల కేంద్రమైన పెదకాకాని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నా ఫార్మాసిస్టు వైద్యురాలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సుమారు 30 వేల మంది ప్రజలు నివసిస్తున్న పెదకాకానిలో ప్రజల వైద్య అవసరాల కోసం నిర్మించిన ఆసుపత్రి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా వెలవెలబోతోంది. గ్రామంలో 10 ప్రైవేటు ఆసుపత్రులు ఉదయం, సాయంత్రం రద్దీగా ఉంటున్నాయి. పెదకాకాని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మాత్రం సరాసరి కేవలం రోజుకు 70 నుంచి 80 మంది వైద్యం కోసం వస్తున్నారు. వాస్తవానికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ డాక్టర్లు ఆసుపత్రిలో వైద్యసేవలు అందించాలి. అలానే పెదకాకాని పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ అయినందు వలన ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఒకరు, 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ మరొకరు, రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ మరొకరు ఏఎన్‌ఎంలు వైద్యసేవలు అందించాల్సి ఉంటుంది. పెదకాకాని పీహెచ్‌సీలో మాత్రం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల కల్లా తాళాలు వేస్తున్నారు. ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సిన వైద్యులు 10 గంటల తరువాత మాత్రమే ఆసుపత్రికి వస్తారు. 2 గంటలు దాటితే ఆసుపత్రిలో ఉండరు. ఆసుపత్రిలో ఎప్పుడు డాక్టరు లేరని అడిగినా డాక్టర్ గుంటూరులో మీటింగ్‌కు వెళ్లారని చెబుతున్నారు. శనివారం 10 గంటలకు ఆసుపత్రికి వచ్చిన వైద్యులు 12:30 గంటలకే వెళ్లిపోయారు. ఇంటి యజమానికే సమయాపాలన లేనపుడు మాకెందుకు అనుకున్నారో ఏమో ఏఎన్‌ఎంలు కూడా పూర్తి స్థాయిలో విధులు నిర్వహించడం లేదు. ఆసుపత్రికి పేషెంట్లు వస్తే ఫార్మాసిస్టు రిజిస్టర్‌లో పేరు నమోదు చేసుకుంటుంది. డాక్టర్ వద్దకు పంపించారనుకుంటే పొరపాటే. సమస్య అడిగి ఎటువంటి వైద్యపరీక్షలు చేయకుండానే ఫార్మాసిస్టే మందులు కూడా ఇస్తారు. అలానే లాబ్‌టెక్నీషియన్ కూడా ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో, ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రికి వచ్చే రోగులకు డాక్టర్‌లు వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వాలని, ఆసుపత్రి వేళలు పాటించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



డాక్టర్లు లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

క్రమపద్ధతిలో స్వీపింగ్ ఉండాలి

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రోడ్ల వెంబడి స్వీపింగ్ క్రమ పద్ధతిలో రోడ్, డివైడర్ వెంబడి సమగ్రంగా శుభ్రం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం జీటీ రోడ్, నల్లపాడు, జేకేసీ కాలేజీరోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులు అంతర్గత రోడ్లు, ప్రధాన రోడ్లను శుభ్రం చేసేప్పుడు తప్పనిసరిగా సెంట్రల్ డివైడర్ వెంబడి కూడా శుభ్రం చేయాలన్నారు. అలాగే రోడ్ల పక్కన డెబ్రిస్ ఉండకుండా పారిశుద్య పనులు మెరుగ్గా జరిగేలా ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్మికులు మస్టర్ అనంతరం ప్రధాన రోడ్లు శుభ్రం, ఇంటింటి చెత్త సేకరణ, మధ్యాహ్నం డ్రైన్ల శుభ్రం చేయాలన్నారు. పలు ప్రాంతాల్లో వేసవిలో చలివేంద్రాల కోసం ఏర్పాటు చేసిన పందిరిలు ఇప్పటికీ ఉండడం గమనించి, తక్షణం వాటిని తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యదర్శులు మస్టర్ సమయానికి తప్పనిసరిగా విధులకు హాజరు కావాలన్నారు. అనంతరం నల్లపాడు, జేకేసీ రోడ్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, నిర్దేశిత నిబంధనలు పాటించి నిర్మాణాలు చేపట్టాలన్నారు. ప్లానింగ్ కార్యదర్శులు సచివాలయం పరిధిలో నిర్మాణాలు జరుగుతున్న తొలి దశలోనే నిబంధనల మేరకు జరుగుతున్నాయా, లేదా అని పర్యవేక్షణ చేయాలన్నారు. అనధికార కట్టడాలపై కార్యదర్శులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్యం పనుల విషయమై మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

కమిషనర్‌గా లక్ష్మీపతిరావు సేవలు ప్రశంసనీయం

తెనాలి అర్బన్: విధి నిర్వహణలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు అందరి మన్ననలను పొందారని మేనేజర్ విల్సన్ జయకర్ పేర్కొన్నారు. లక్ష్మీపతిరావు ఉద్యోగ విరమణ సందర్భంగా కొత్తపేటలోని రామకృష్ణ కవి కళా క్షేత్రంలో శనివారం వీడ్కోలు సభను ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జయకర్ మాట్లాడుతూ శానిటరి ఇన్‌స్పెక్టర్‌గా తెనాలిలో పనిచేసి, ఇదే మున్సిపాలిటీలో ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేయడం అరుదుగా జరిగే సంఘటనగా పేర్కొన్నారు. ఆయన శేష జీవితం సంతోషంగా గడపాలని ఆకాక్షించారు. ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఉద్యోగులంతా నిబద్ధతతో పని చేయడం వల్ల మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా ఏసుబాబు, సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్ వలి, హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దావులూరి శ్రీనివాసరావు, ప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, శానిటరీ సెక్రటరీలు, నగర దీపికలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



లక్ష్మీపతిరావును సన్మానిస్తున్న మేనేజర్ జయకర్, ఉద్యోగులు

అన్న క్యాంటీన్‌కు ఆర్వో ప్లాంట్ వితరణ

తెనాలి టౌన్: స్థానిక బస్టాండ్ వద్ద గల అన్న క్యాంటీన్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్‌ను శనివారం వితరణగా అందజేశారు. రోటరీ– 3150 గవర్నర్ సోమవరపు వెంకట రామప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్లాంట్‌ను ప్రారంభించారు. దాతల సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ముదావహమని కొనియాడారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ కొడాలి వెంకటేశ్వరరావు, భారతీదేవి, కావూరి శివరామకృష్ణ, అఖిలాండేశ్వరమ్మ, డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్ సహకారంతో ఈ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, గుత్తా వెంకటరత్నం, పలువురు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

పాస్టర్ సుబ్రహ్మణ్యానికి ఘన నివాళి

తెనాలి రూరల్: పాస్టర్ చిలువూరి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థ కూడికను మల్లెపాడులోని ఆయన స్వగృహం వద్ద శనివారం నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సుద్దపల్లి నాగరాజు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మానుకొండ శివప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్, కఠెవరపు దేవయ్య, దుబాయ్ బాబు, దైవ సేవకులు బిషప్ సుధీర్‌కుమార్, ఎ. భాను ప్రసాద్, చిలువూరి నతానియేలు, భాగ్యరాజ్, కిషోర్, మాజీ ఎంపీటీసీ పినపాటి సురేష్ బాబు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలకు తగ్గట్లుగా డిజిటల్ రూపాంతరం

- ప్రముఖ స్ట్రక్చరల్ డిజైన్ ఇంజనీర్ డి.పూర్ణచంద్రరావు
- ఆర్‌వీఆర్‌జేసీలో సెమినార్

గుంటూరు రూరల్: ఆధునిక యుగంలో ఎత్తైన భవనాల నిర్మాణం వేగవంతం, ఖచ్చితమైన, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా డిజిటల్ రూపాంతరం కీలక పాత్ర పోషిస్తోందని ప్రముఖ స్ట్రక్చరల్ డిజైన్ ఇంజనీర్ డి.పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రీచింగ్ న్యూ హైట్స్ అఫ్ హై–రైజ్ బిల్డింగ్స్ ఇన్ ది డిజిటల్ ఎరా అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృత్రిమ మేధ, బిగ్ డేటా, డ్రోన్ టెక్నాలజీ, 3–ఈ మోడలింగ్ వంటి ఆధునిక సాంకేతికతల వినియోగంతో హై–రైజ్ భవనాల రూపకల్పనలో కొత్త విప్లవం చోటు చేసుకుంటుందని తెలిపారు. భవిష్యత్ తరాల కోసం స్మార్ట్, సస్టైనబుల్, డిజిటల్ ఆధారిత నగరాల నిర్మాణం అవసరమని, ఇంజినీరింగ్ విద్యార్థులు ఆ దిశగా నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు చేయాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు సృజనాత్మకతతో నూతన భవన నమూనాలను ఆవిష్కరించి, సమాజానికి ఉపయోగపడే నిర్మాణాలు చేయాలని కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఏఎస్ ప్రసాద్, డాక్టర్ కృష్ణసాయి, అధ్యాపకులు, విద్యార్థులు అతిథులను సన్మానించారు.



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సీఆర్‌డీఏ కమిషనర్ కె కన్నబాబు

నీరుకొండ(మంగళగిరి): రాజధాని నిర్మాణంలో వరల్డ్ బ్యాంక్, ఏషియన్ డెవలప్ మెంట్ బ్యాంక్‌లు ఫండింగ్ సంస్థలుగా వున్న నేపథ్యంలో వాటి నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. మండలంలోని నీరుకొండలో కల ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రెండు రోజుల పాటు సీఆర్‌డీఏ, నిక్‌మార్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు నిర్వహించిన హెచ్ఎస్ఈఎం వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసిందన్నారు. రాజధాని నిర్మాణ ప్రాజెక్టులలో ఆరోగ్య భద్రత, పర్యావరణ అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్మాణం జరగాలన్నారు. రాజధాని నిర్మాణంలో ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, కన్సెల్టెంట్‌లు తదితర భాగస్వాములకు నైపుణ్య వృద్ధిని అందించే లక్ష్యంతో వర్క్‌షాప్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. 165 మంది అధికారులు పాల్గొనగా అధికారులంతా ప్రతిజ్ఞ చేశారు. వృత్తి నిపుణులు తమ పనిచేస్తున్న ప్రాజెక్టుల స్వభావం, నాణ్యత తదితర అంశాలపై లోతైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులు, నిపుణులలో నైపుణ్యత పెంపొందించుకోవడానికి వర్క్‌షాప్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిక్‌మార్ యూనివర్శిటీ స్కూలు ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ డాక్టర్ సర్వేష్ మిశ్రా, ప్రొఫెసర్లు డాక్టర్లు ఎం.కామరాజన్, విష్ణు నంబూద్రి, ఎస్‌వీఎస్ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంక్రీట్ తయారీలో నూతన పరిశోధన

తాడేపల్లిరూరల్: భవన నిర్మాణాలలో ఖర్చులను తగ్గిస్తూ ఎక్కువ కాలం మనగలిగే విధంగా కాంక్రీట్‌ను తయారు చేయడంలో కేఎల్‌యూ పరిశోధనా విద్యార్థి కన్నెగంటి జ్యోతిష్య బ్రహ్మచారి విజయం సాధించినట్లు వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. శనివారం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరిశోధనలో విజయం సాధించినందు గాను కేఎల్‌యూ బ్రహ్మచారికి పీహెచ్‌డీ ప్రదానం చేసిందని తెలిపారు. కన్నెగంటి జ్యోతిష్య బ్రహ్మచారి కాంక్రీట్ తయారీలో అనేక రకాల పరిశోధనలు చేశారని, ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి కాంక్రీట్ తయారీపైన పట్టు సాధించారన్నారు. దీర్ఘకాలిక స్థిరత్వ సామర్థ్యం, నాణ్యత పెంపునకు దోహదపడుతుందన్నారు.



ప్రణాళికబద్ధంగా మిషన్ గ్రీన్ గుంటూరు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు నగరపాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా ఎండ్ టూ ఎండ్ రోడ్ల నిర్మాణం, మిషన్ గ్రీన్ గుంటూరు ద్వారా పచ్చదనం పెంపు వంటి చర్యలు తీసుకుంటుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాం(ఎన్.క్యాప్)లో భాగంగా నగరంలో చేపట్టాల్సిన అంశాలపై వివిధ శాఖల అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వాయు కాలుష్యం తగ్గించి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించేందుకు మిషన గ్రీన్ గుంటూరులో భాగంగ దశల వారీగా 5 లక్షల మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ప్రొఫెసర్ బాల ప్రసాద్ సూచనల మేరకు రానున్న కాలంలో గుంటూరు నగరాన్ని కాలుష్య రహిత వాతావరణ నగరంగా తీర్చిదిద్దుకోవడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి ముందుకు సాగుతామన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ప్రొఫెసర్ బాలప్రసాద్(ఆంధ్రా యూనివర్సిటీ), డీఎఫ్ఓ హిమశైలజ, జిల్లా పరిశ్రమల శాఖ డీడీ మధుసూదన్ రెడ్డి, ఇన్‌చార్జి డీఎస్ఓ కె.శ్రీనివాస్, ఆర్టీఓ కె.శ్రీహరి, ఏఓ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లపై చర్యలు

నగరంలో అనధికారిక లే అవుట్లు, ప్లాట్లు యజమానులు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం 2020 లో రెగ్యులరైజ్ చేయించుకోకపోతే, వాటికి ప్రభుత్వ సేవలను, రిజిస్ట్రేషన్ నిలిపివేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

వినాయక విగ్రహం ఊరేగింపులో అపశ్రుతి

బాణసంచా ఉన్న ఆటోలో పడటంతో పేలి వృద్ధుడికి తీవ్రగాయాలు

రాయపూడి(తాడికొండ): వినాయక విగ్రహం ఊరేగింపులో అపశ్రుతి జరిగి వృద్ధుడు గాయాలపాలైన ఘటన తుళ్ళూరు మండలంలో రాయపూడి గ్రామంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. రాయపూడి నిమ్మకాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఊరేగింపు నిర్వహిస్తుండగా టపాసులు కాల్చిన రవ్వలు ప్రమాదవశాత్తు బాణసంచా ఉన్న ఆటోలో పడటంతో అందులో ఉన్న టపాసులు అంటుకొని ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనలో పక్కనే ఉన్న వృద్ధుడు కె పేరయ్యకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం వెంటనే విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

రూ.2.30 లక్షలు పలికిన లడ్డూ

తెనాలి: స్థానిక బోసు రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో జరుగుతున్న వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామి లడ్డూను వేలం వేశారు. పట్టణానికి చెందిన మాజేటి కృష్ణకిశోర్ అత్యధికంగా రూ.2.30 లక్షలకు పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో నంబూరు నరేంద్ర, భాస్కరుని శ్రీనివాసరావు, కంకిపాటి శ్రీమన్నారాయణ, డి.మణిదీప్, సీహెచ్ చంద్ర, నూకల ఆదిత్య, సాధు ప్రతాప్, కొల్లా గురునాథ గుప్త పాల్గొన్నారు.



లడ్డూతో కృష్ణకిశోర్

పాస్టర్లకు నూతన వస్త్రాల పంపిణీ

తెనాలి: కెనడాలో ఆకస్మికంగా మృతి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు లెరీ స్మారకార్థ సభను శనివారం మధ్యాహ్నం స్థానిక ఆలపాటి నగర్‌లోని రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో నిర్వహించారు. గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన పలువురు పాస్టర్లతో ఏర్పాటైన జ్ఞాపకార్థ కూడికకు బిషప్ డాక్టర్ గొరికపూడి భాగ్యరాజు అధ్యక్షత వహించారు. లెరీ, ఆయన సతీమణి డెబర్‌తో చేసిన సామాజిక సేవను సినీ దర్శకుడు దిలీప్‌రాజా, బిషప్ కోట ఏసుదాసు, పాస్టర్ గిడ్యోను, పాస్టర్ ప్రతీక్, పాస్టర్ జక్రయ్య వివరించారు. హాజరైన పాస్టర్లకు లెరీ స్మారకార్థం నూతన వస్త్రాలను దిలీప్‌రాజా పంపిణీ చేశారు. కార్యక్రమానికి పినపాటి సురేష్‌బాబు స్వాగతం పలకగా, రావూరి సురేష్‌బాబు వందన సమర్పణ చేశారు.